క్లుప్తంగా

ధర్నాను జయప్రదం చేయాలి

నల్లగొండ టౌన్: రూ.లక్షలోపు పంట రుణాలను వెంటనే మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దండెంపల్లి సత్తయ్య పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కతాల్‌గూడెంలో ధర్నా కరపత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పంటరుణాలను మాఫీ చేయకపోవడంతో రైతులు పెట్టుబడుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు దండెంపల్లి సరోజ, మారగోని నగేష్, బచ్చగోని మల్లేష్, పనస చంద్రయ్య, దండెంపల్లి యాదయ్య, బొమ్మ నాగరాజు, మారయ్య, జెట్టి యాదయ్య, అంజమ్మ, పెంటయ్య పాల్గొన్నారు.

ఫార్మా నిర్మాణ పనులు నిలిపివేయాలి



దీక్షలో కూర్చున్న అఖిలపక్ష నాయకులు

మునుగోడు: ప్రజల ప్రాణాలకు హాని కలిగించే ఫార్మా కంపెనీ నిర్మాణ పనులు నిలిపివేసే వరకు తమ ఉద్యమం కొనసాగిస్తామని ఫార్మా వ్యతిరేక కమిటీ కన్వీనర్ భీమనపల్లి సైదులు అన్నారు. మునుగోడు మండలంలోని కిష్టాపురం గ్రామంలో నిర్మిస్తున్న ఫార్మా కంపెనీ నిర్మాణ పనులు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం 65వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో ఫార్మా వ్యతిరేక కమిటీ సభ్యులు పోగుల సుధాకర్ రెడ్డి, మాధవరెడ్డి, నాగిరెడ్డి, నందిపాటి వెంకన్న, మల్లయ్య, ఏనుగుల రమేష్, బోయ చంద్రయ్య, నందిపాటి ముత్యం, అంజయ్య, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే..



నూతన అధ్యక్షుడికి నియామకపత్రం అందజేస్తున్న నర్సింహగౌడ్

మునుగోడు: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సురిగి నర్సింహగౌడ్ ధీమా వ్యక్తం చేశారు. మునుగోడు మండలంలోని చల్మెడ గ్రామ కాంగ్రెస్ నూతన కమిటీని ఆదివారం గ్రామంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలే కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తాయన్నారు. అనంతరం నూతనంగా ఎన్నుకున్న గ్రామశాఖ అధ్యక్షుడు కొంక చంద్రయ్యకు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో కిష్టాపురం ఎంపీటీసీ భీమనపల్లి సైదులు, బ్లాక్ కాంగ్రెస్ నాయకుడు పాల్వాయి చెన్నారెడ్డి, మేక ప్రదీప్ రెడ్డి, కొంక రాజయ్య, బాతరాజు సత్తయ్య, గాదెపాక అంజయ్య, బండమీది గోపాల్ పాల్గొన్నారు.

బీసీ యువజన సంఘం మండల అధ్యక్షుడిగా శివ



నియామకపత్రం అందుకుంటున్న శివ

చండూరు: బీసీ యువజన సంఘం మండల అధ్యక్షుడిగా కొండాపురం గ్రామానికి చెందిన గిరి శివగౌడ్ నియామకమయ్యారు. ఈమేరకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గండి చెర్వు వెంకన్న ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం నియామకపత్రాన్ని జిల్లా కేంద్రంలో శివకు అందజేశారు.

మత్స్య సహకార సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



సంఘం కార్యవర్గసభ్యులతో సర్పంచ్ అల్లి సైదులు, ఎన్నికల అధికారి తరుణ్

శాలిగౌరారం: మండలంలోని ఇటుకులపహాడ్ గ్రామంలో ఈదులచెరువు మత్స్య సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అల్లి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు భీనబోయిన హరిప్రసాద్, కార్యదర్శి అంబటి శ్రవణ్‌కుమార్, డైరెక్టర్లుగా అలువాల శ్రవణ్‌కుమార్, సాదుల సాయికిరణ్, నీలం వినయ్‌కుమార్, సూర రాకేశ్, అంకిరెడ్డి మహేశ్, కనుకు స్నేహిత్‌లు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి సర్పంచ్ అల్లి సైదులు, ఎన్నికల అధికారి తరుణ్‌లు నియామక పత్రాలు అందజేశారు.

ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందుతున్న రైతులు
- నకిరేకల్ నియోజకవర్గంలో ప్రస్తుతం 800 ఎకరాల్లో పంట సాగు
- 2 వేల ఎకరాల్లో సాగు లక్ష్యంగా పెట్టుకున్న ఉద్యానశాఖ అధికారులు



కేతేపల్లిలోని ఆయిల్‌పామ్ తోట

కేతేపల్లి: నకిరేకల్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో రైతులు వరి, పత్తి వంటి ఇతర పంటల కంటే ఆయిల్‌పామ్ సాగు వైపు ఆసక్తి చూపుతున్నారు. తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం ఉండడంతో ఈ సాగుకే మొగ్గు చూపుతున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 2000 ఎకరాల్లో సాగు లక్ష్యంగా ఉద్యానశాఖ అధికారులు పని చేస్తున్నారు. అధికారుల గణాంకాల ప్రకారం ప్రస్తుతం 800 ఎకరాల్లో పంట సాగవుతోంది. మరో 600 ఎకరాల్లో సాగుకు రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు.

సబ్సిడీపై డ్రిప్, మొక్కలు

ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులకు ఏడాదికి ఎకరాకు రూ.2100 మొక్కల సంరక్షణకు, మరో రూ.2100 అంతర పంట సాగు కోసం ఉద్యానశాఖ నుంచి చెల్లిస్తున్నారు. దీంతో పాటు మొక్కలకు నీరందించేందుకు సరిపడా డ్రిప్‌ను అందజేస్తారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, బీసీలకు 90 శాతం, జనరల్ రైతులకు 80శాతం సబ్సిడీతో వస్తుంది. ఒక ఆయిల్‌పామ్ మొక్క ఖరీదు రూ.250 కాగా అందులో రూ.230 ప్రభుత్వం భరించగా రైతు కేవలం రూ.20 చెల్లించాల్సి ఉంటుంది. అయితే మొక్క నాటుకున్న తర్వాతే కంపెనీకి డబ్బులు చెల్లిస్తుంది. పంట సాగు చేసిన రైతులకు నాలుగేళ్ల వరకు ఎలాంటి ఆదాయం రాదు. నాలుగు సంవత్సరాల పాటు మొక్కల మధ్య పత్తి, వేరుశనగ, పెసలు, అలచంద, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేసుకుని ఆదాయం పొందవచ్చు.

ఎకరాకు రూ.1.50లక్షల ఆదాయం

సాధారణ పంటలకు అధిక పెట్టుబడులు ఉండటంతో పాటు ఆదాయం అంతంత మాత్రంగానే వస్తుంది. దీంతో నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో రైతులు సాధారణ పంటల సాగుకు స్వస్తి పలికి ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈపంట సాగు చేస్తున్న రైతులకు నాలుగు సంవత్సరాల తర్వాత ఆదాయం అధిక మొత్తంలో వస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. ఒక్కసారి మొక్కలు నాటితే సుమారు 20 నుంచి 25 ఏళ్ల వరకు దిగుబడి పొందే అవకాశం ఉందని చెబుతున్నారు. ఎకరా విస్తీర్ణంలో పంట సాగు చేస్తే 10 నుంచి 15 టన్నుల దిగుబడి వస్తుందని, ఏడాదికి రూ.లక్షన్నర వరకు ఆదాయం వస్తుందని ఉద్యానశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

నాలుగు ఎకరాల్లో సాగు చేస్తున్నా



సాధారణ పంటల సాగుతో విసిగిపోయాను. సరైన దిగుబడి, ఆదాయం లేక ఏటా పెట్టుబడులు కూడా రావటం లేదు. ఆయిల్‌పామ్ సాగు చేస్తే లాభదాయకంగా ఉంటుందని భావించి నాలుగు ఎకరాల్లో సాగు చేస్తున్నా. అధికారులు సబ్సిడీ కింద డ్రిప్, మొక్కలు అందజేశారు.

– బందా లూబెల్, కేతేపల్లి

వరితో ఆదాయం రావడం లేదు



వరిసాగు చేస్తే ఆదాయం పెద్దగా రావడం లేదు. ఆయిల్ పామ్ సాగు లాభదాయకంగా ఉంటుందని అధికారులు చెప్పటంతో వరి సాగు బంద్ చేసి ఐదు ఎకరాల్లో ఈ మొక్కలు నాటాను. డ్రిప్‌తో నీరు అందిస్తున్నా. సమయానుకూలంగా ఎరువులు వేస్తూ మొక్కలను సంరక్షిస్తున్నా.

– మోదుగు దామోదర్‌రెడ్డి, కొర్లపహాడ్

రైతుల నుంచి స్పందన వస్తోంది

ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. సాగుపట్ల రైతుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 800 ఎకరాల్లో మొక్కలు నాటించాం. ఆయిల్‌పామ్ సాగుతో దీర్ఘకాలిక నికర ఆదాయం వస్తుంది. సాధారణ పంటల సాగుతో పోల్చుకుంటే పెట్టుబడి ఖర్చులు కూడా తక్కువగా ఉంటాయి.

– విద్యాసాగర్, నియోజకవర్గ ఉద్యాన అధికారి, నకిరేకల్

నేటి నుంచి బడిబాట, పఠనోత్సవం

మర్రిగూడ: ఈనెల 26 నుంచి జూలై 6వరకు రెండవ విడత బడిబాట, జూలై 31 వరకు పఠనోత్సవం నిర్వహించనున్నట్లు ఎంఈఓ గురువారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బడిబాటలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి, పాఠశాలల బలోపేతానికి నిర్దేశించిన లక్ష్యాలను నెరవేర్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



చాడ కిషన్‌రెడ్డిని సన్మానిస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

కనగల్: మండల పరిధిలోని కురంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి ఆదివారం రూ.25వేల విరాళం అందజేశారు. అనంతరం ఆలయంలో పూజలు చేశారు. సర్పంచ్ తలారి కరుణశ్రీరవీందర్, ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో పోలె వెంకటాద్రి, పోలోజు వెంకటాచారి, ఎస్‌కే లతీఫ్, ముక్కమల వెంకన్న,, కర్నాటి మల్లేష్, గాషిరాం, శంకర్‌రెడ్డి, ఈశ్వర్, నాగర్జున, పెరిక లింగయ్య, ఏపూరి యాదయ్య, తలారి వెంకటేశం, నరసింహ, పెద్ద లింగయ్య, మహేష్, జిల్లా మనిబాబు పాల్గొన్నారు.

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా అంజయ్య

నకిరేకల్: నకిరేకల్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్‌గా నకిరేకల్‌కు చెందిన యాతాకుల అంజయ్య రెండోసారి నియామకమయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు.

ఇంటింటికీ బీజేపీ

కనగల్: కేంద్రంలో ప్రధాని మోదీ ప్రభుత్వం ఏర్పడి 9సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా మహాజన అభియాన్ పేరుతో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా కనగల్ మండలంలోని పానుగోడు గ్రామంలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పులకరం భిక్షం, కట్ట అశోక్, పులకరం హరిబాబు, స్వామి, కార్తీక్, హరికృష్ణ, వెంకన్న తదితరులున్నారు.

చేనేత కార్మికులకు బీమా పత్రాల పంపిణీ



బీమా పత్రాలు పంపిణీ చేస్తున్న సైదిరెడ్డి

కేతేపల్లి: మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో చేనేత కార్మికులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5లక్షల బీవిత బీమా పత్రాలను మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కొండేటి సైదిరెడ్డి ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చిలుకూరి అంజయ్య, టీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు అనుముల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు కొనసాగించాలి



మహిళలకు చీరలు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

చిట్యాల: వాసవీ క్లబ్ సభ్యులు సమాజ సేవా కార్యక్రమాలను నిరంతరం చేపట్టాలని ఆ క్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేషన్ వైస్ ప్రెసిడెంట్ నంబూరి వెంకట పద్మజ, డైమండ్ స్టార్ గ్రంధి సత్యనాగ నర్సింహారావు, రాయపూడి భవాని అన్నారు. చిట్యాల వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం డాన్ టూ డస్క్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పలు సేవా కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఆర్మీ జవాన్ యాస కిరణ్‌రెడ్డి, రైతు మెండె సైదులు, యోగ గురువు పున్న పాండులను సన్మానించారు. అనంతరం పలువురు పేదలకు దుస్తులు, బియ్యం, దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, జిల్లా మహిళా అధ్యక్షురాలు పందిరి గీత, మండల అధ్యక్షుడు తేరటుపల్లి హనుమంతు, జిల్లా ఉపాధ్యక్షుడు బుస్సా శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి శీలా సత్యనారాయణ, రంగా వెంకటేశ్వర్లు, బుద్ధ క్రిష్ణమూర్తి, పోల పెద్దయ్య, పోలా భాసయ్య, పోల ధనమ్మ, శీల అనిత, పోల సరోజ, కలకుంట్ల రవి, వనమా ప్రవీణ్, పోలా నవీన్, ఇమ్మడి వెంకన్న పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



కట్టంగూర్: మాట్లాడుతున్న రఘునందన్



చెన్నారంలో మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

కట్టంగూర్: గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కట్టంగూర్ మండలంలోని ఈదులూరు సర్పంచ్ ఐతగోని నారాయణగౌడ్ కోరారు. ఆదివారం ఆ గ్రామంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నకిరేకల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా వైద్యులు రోగులను పరీక్షించి రూ.లక్ష విలువ చేసే మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భవాని, ఐఎంఏ అధ్యక్షుడు రాపోలు రఘునందర్, కార్యదర్శి గౌతమ్‌రెడ్డి, ట్రెజరర్ పూర్ణచందర్, వైద్యులు ఉన్నారు.

కనగల్, చెన్నారంలో వైద్య శిబిరాల ఏర్పాటు

కనగల్: మండల పరిధిలోని చెట్లచెన్నారం గ్రామంలో కడిమి హాస్పిటల్, కనగల్ గ్రామంలో సంరక్ష హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. చెట్లచెన్నారంలో 100మందికి, కనగల్‌లో 200మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ గౌరీశ్రీ, శశిపాల్ రెడ్డి, కవిత, గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌లు నర్సింగ్ సునీత, గన్నెబోయిన గంగమ్మ, మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, రాయల శ్రవణ్, సునీల్ తదితరులున్నారు.

కనగల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కనగల్ మండల వ్యాప్తంగా నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యులు వరూదిని ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. చర్లగౌరారంలో డాక్టర్ సుచరిత, చెట్లచెన్నారంలో డాక్టర్ గౌరిశ్రీ, తేలకంటిగూడెంలో లీలావతి, ఇరుగంటిపల్లిలో పుల్లారావు, అనిత, పర్వతగిరిలో విశల్, కనగల్‌లో షషిపాల్‌రెడ్డి, జి.యడవల్లిలో శశాంక్ సహకారంతో ఆయా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు.

ఉచిత యోగా శిక్షణ

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో సత్యసాయి ధ్యాన మండలి ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. రాపోలు గురూజీచే ఉదయం 5.30 నుంచి 6.30 గంటల వరకు యోగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 99667 76365, 98485 57372 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఆర్థికసాయం అందజేత



రూ.25లక్షల చెక్కును అందజేస్తున్న ప్రభాకర్‌రెడ్డి స్నేహితులు

నకిరేకల్: నకిరేకల్ వాసి, రంగారెడ్డి జిల్లా దుండిగల్ ఎస్ఐగా పని చేస్తున్న ప్రభాకర్‌రెడ్డి ఈనెల 8న గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం హైదరాబాద్‌లోని వారి నివాసంలో ఆయన మిత్రులు 2014 బ్యాచ్ టీఎస్, ఏపీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.25 లక్షల చెక్కును వారి కుటుంబీకులకు అందజేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



చైత్రయ్య కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న పిల్లి రామరాజు

కనగల్: మండల పరిధిలోని జి.యడవల్లి గ్రామానికి చెందిన పర్సనబోయిన చైత్రయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, ఆర్‌కేఎస్ ఫౌండేషన్ చైర్మన్ పిల్లి రామరాజు ఆదివారం రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా బోయినపల్లి గ్రామానికి చెందిన పర్సనబోయిన వెంకన్న చేతికి ఇటీవల కూలర్ పంక తగిలి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా రూ.5వేల సాయం అందించారు.

చిప్పలపల్లి గ్రామంలో..

నార్కట్‌పల్లి: మండలంలోని చిప్పలపల్లి గ్రామానికి చెందిన పోలోజు బ్రహ్మచారి కుమారుడు నరసింహాచారి పక్షవాతంతో బాధపడుతూ పది రోజుల క్రితం మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు సంతానం. వారి జీవనోపాధి, తల్లిదండ్రుల జీవనానికి చిప్పలపల్లి గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు రూ.85 వేల ఆర్థికసాయాన్ని సేకరించి బాధిత కుటుంబానికి ఆదివారం అందజేశారు.

అన్ని గ్రామాల్లో రోడ్ల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్: నకిరేకల్ నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్‌లోని మెయిన్ సెంటర్ నుంచి తిప్పర్తి రోడ్డు చీమలగడ్డ ఫ్లైఓవర్ వరకు రూ.2.70 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఇప్పటికే నకిరేకల్ పట్టణంలో రూ.26 కోట్లతో రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులు జరుగుతున్నాయన్నారు. త్వరలో మార్కెట్, మూసీ రోడ్డు విస్తరణ పనులు కూడా చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ మాధ ధనలక్ష్మీనగేష్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు యల్లపురెడ్డి సైదిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ మట్టి కవిత వీరు, గర్శకోటి సైదులు, పల్లె విజయ్, రాచకొండ సునీల్‌గౌడ్, గడ్డం స్వామి, నాయకులు సోమ యాదగిరి, పెండెం సదానందం, మురారి శెట్టి కృష్ణమూర్తి, రాచకొండ వెంకన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నకిరేకల్‌లో రూ.32 కోట్లతో నిర్మిస్తున్న 100 పడకల వైద్యశాల భవన నిర్మాణం పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. గడువు లోగా నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. నకిరేకల్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన 12 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.5.50లక్షల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

గురుకుల పాఠశాలకు సొంత భవనం ఏర్పాటు

- ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి



దోనిపాములలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

చండూరు: మహాత్మా జ్యోతిరావ్ పూలే వెనుకబడిన తరగతుల బాలికల గురుకుల పాఠశాలకు సొంత భవనానికి నిధుల మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం చండూరు మండలంలోని దోనిపాముల గ్రామంలో ప్రభుత్వ భూమిని ఆయన పరిశీలించి మాట్లాడారు. అధికారులు స్థల నిర్ధారణ చేయాలని సూచించారు. తెలంగాణలో ప్రతి విద్యార్థి కార్పొరేట్ విద్య చదువుకోవాలనే గురుకుల పాఠశాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలు సైతం అమలు చేస్తున్నామన్నారు. ఆయన వెంట పాఠశాల ప్రిన్సిపాల్ తిరందాసు నర్మద, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మరబోయిన వెంకన్న, దాసరి స్వామి, పాండు, దశరథ, చంద్రయ్య, వెంకన్న, సైదులు, శంకర్, నర్సింహ, యాదగిరి, కాటం రవి తదితరులున్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

కట్టంగూర్: మండల కేంద్రంలోని సాందీపని ఉన్నత పాఠశాలకు చెందిన 2007–08 విద్యా సంవత్సరం 10వ తరగతి పూర్వవిద్యార్థులు ఆదివారం కట్టంగూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తమ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డిపల్లి సాగర్, హెచ్‌ఎం రాములు, పటేల్ నర్సిరెడ్డి, ప్రకాశ్, శాలి, నాగిరెడ్డి, భిక్షం, కృష్ణయ్య, పద్మ, కళావతి, లక్ష్మి, పూర్వ విద్యార్థులు సుంకరబోయిన వేణు, నోముల ప్రశాంత్, ముక్కాంల శ్రీశైలం, ఇర్ఫాన్, రాజేష్, విక్రమ్, రాజు, రాము, సతీష్, నరేష్, సరిత,మౌనిక, లావణ్య, భవాని, సునిత, జ్యోతి, రాజేశ్వరి, అనురాధ, రేణక, లక్ష్మి ఉన్నారు.

పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్‌గా శంభులింగారెడ్డి



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

శాలిగౌరారం: మండలంలోని వల్లాల గ్రామంలో గల మదర్ డెయిరీ(నార్మూల్) పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం చైర్మన్‌గా ఆ గ్రామానికి చెందిన ఎర్ర శంభులింగారెడ్డి ఎన్నికయ్యారు. పదిమంది డైరెక్టర్లతో కలిగిన వల్లాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘంలో ఆదివారం మూడు డైరెక్టర్ల స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఎన్నికల్లో రెండు డైరెక్టర్ స్థానాల్లో సీపీఎం బలపరచిన కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులు గెలుపొందగా ఒక డైరెక్టర్ స్థానంలో బీఆర్ఎస్ సానుభూతిపరుడు గెలుపొందారు. గెలుపొందిన డైరెక్టర్లలో జాల భిక్షం, దొంగరి నాగరాజు, కంచుగట్ల సైదులు ఉన్నారు. నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లతో పాటూ చైర్మన్‌గా ఎన్నికైన శంభులింగారెడ్డిని స్థానిక సర్పంచ్ షేక్ ఇంతియాజ్, ఎంపీటీసీ మాదగోని కవితరామలింగయ్యలతో పాటు పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం డైరెక్టర్లు, నాయకులు అభినందించారు.

జనసేన మండల కమిటీ నియామకం

నార్కట్‌పల్లి: జనసేన మండల అధ్యక్షుడిగా నార్కట్‌పల్లి మండలంలోని ఏపీ లింగోటం గ్రామానికి చెందిన మరీదు శివకృష్ణ నియామకమయ్యారు. ఈమేరకు ఆ పార్టీ నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెర్కుపల్లి రామలింగయ్య ఆదివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. మండల ఉపాధ్యక్షులుగా జమార్లు వినోద్‌రెడ్డి, గుండె ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ తన్వీర్, అదేవిధంగా కార్యదర్శులు, 11 మంది కమిటీ సభ్యులను నియమించారు.

గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

చౌటుప్పల్ : గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్ అన్నారు. ఇటీవల మృతి చెందిన తంగడపల్లి గ్రామానికి చెందిన లింగాల జంగయ్యకు, తాటి చెట్టుపై నుంచి జారి పడి తీవ్రంగా గాయపడిన అదే గ్రామానికి చెందిన ఇట్టగోని ముత్యాలుకు కార్పొరేషన్ నుంచి నుంచి మంజూరైన రూ.5లక్షల చెక్కులను ఆదివారం అందజేశారు.

పింఛన్ కోసం ఎదురుచూపులు



వరికుప్పల ఆండాలు

మర్రిగూడ: మండలంలోని శివన్నగూడ గ్రామానికి చెందిన వరికుప్పల ఆండాలు భర్త సత్తయ్య మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. ఇప్పటివరకు ఆండాలుకు ప్రభుత్వం నుంచి రావాల్సిన వితంతు పింఛన్ అందడం లేదు. ఈమెకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. తమకు భూమి లేదని కూలీనాలి చేసుకుంటేనే పూట గడుస్తుందని, తమ కుమారులు ఉపాధి కోసం వలస వెళ్తుంటారని ఆండాలు పేర్కొంది. ఇప్పటికే పలుమార్లు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నానని తెలిపింది. ఆన్‌లైన్‌లో పేరు చూపిస్తుంది కానీ ప్రభుత్వం రిలీజ్ చేసినప్పుడే పింఛన్ వస్తుందని అధికారులు చెబుతున్నారని పేర్కొంది. తనకు పింఛన్ అందించే విధంగా అధికారులు చొరవ చూపాలని ఆమె కోరుతోంది.

భయం భయంగా విధులు



శిథిలావస్థకు చేరిన చండూరు వ్యవసాయాధికారి కార్యాలయం



కార్యాలయం లోపల కుంగిన నేల

చండూరు: చండూరు వ్యవసాయ శాఖాధికారి కార్యాలయానికి పక్కా భవనం లేకపోవడంతో శిథిలావస్థకు చేరిన భవనంలో కార్యాలయం ఏర్పాటు చేసుకొని అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. ఈ భవనం ఏ క్షణాన కూలుతుందోనని భయపడుతున్నారు. నేల కుంగిపోవడంతోపాటు, పై పెచ్చులు ఊడి కింద పడుతున్నాయి. పాములు, తేళ్లు కార్యాలయంలోకి చేరుతున్నాయి.

దారంతా మురుగు



ఆరెగూడెంలోని వీధిలో నిలిచిన మురుగు

చిట్యాల: మండలంలోని ఆరెగూడెం గ్రామ పంచాయతీలోని ఎనిమిదో వార్డులో ఇళ్లలోని మురుగునీరు వీధుల్లోనే నిలుస్తోంది. ఈ దారి గుండా పాదచారులు, వాహనదారులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా ఈగలు, దోమలు విజృంభిస్తున్నాయి. పలుమార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వార్డు ప్రజలు ఆరోపిస్తున్నారు.